సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి ...

బుధవారం 05 మార్చి 2025 , పేజీలు 04

అదిలాబాద్ - మంచిర్యాల



సూర్య
www.suryaa.com


★ నిర్మల్ ★ కొమురంభీం ఆసిఫాబాద్


### ఈవీఎం గోదాంను పరిశీలించిన

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్,సూర్య మేజర్ న్యూస్**

జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోదాంను మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈవీఎం గోదాం వద్ద భద్రత సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించాలని సూచించారు. షిఫ్టుల వారీగా భద్రతను పర్యవేక్షించాలని, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఇతర సామాగ్రికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా గోడౌన్ లో పూర్తి స్థాయిలో భద్రత కల్పించాలని ఆదేశించారు.ఈ పరిశీలనలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, భద్రతా సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

### - విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి

### - జిల్లా పాలనాధికారి రాజర్షి షా

**ఆదిలాబాద్ ,సూర్య మేజర్ న్యూస్**

నేటి నుండి నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు సంబంధించి మంగళవారం సంబంధిత అధికారులతో జిల్లా పాలనాధికారి రాజర్షి షా టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్ల పై దిశా నిర్దేశం చేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులకు సమయానుకూలంగా రవాణా సదుపాయం అందుబాటులో ఉండేలా బస్సులు నడిపించాలని, నిరంతర విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని నిర్ణీత సమయానికి సకాలంలో ప్రశ్నపత్రాలు కేంద్రాలకు చేరేలా చర్యలు చేపట్టాలని, పోస్టల్ అధికారులు ప్రశ్నా పత్రాలను జాగ్రత్తగా తరలించాలని, పరీక్షలు ప్రారంభం అయ్యే సమయానికి ముందే విద్యార్థులు తమకు కేటాయించబడిన పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, సెల్ ఫోన్లు , ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల లో అనుమతి లేదని స్పష్టం చేశారు పరీక్ష వ్రాసే సమయంలో అరగంట కొకసారి బెల్ మోగుతుందని, పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి వేయించాలని, 144 సెక్షన్ అమలు, పోలీస్ బందోబస్తు, తదితర ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించడం,ప్రతి పరీక్షా కేంద్రంలోనూ తప్పనిసరిగా తాగునీటి వసతి , ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలను నియమిస్తూ ఫస్ట్ ఎయిడ్ కిట్ తో అందుబాటులో ఉండాలని, కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్



స్క్వాడ్ బృందాలను కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని, ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్షలు జరిగేలా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలనీ అన్నారు ఈ సందర్భంగా విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు వ్రాయాలని, అల్ ది బెస్ట్ తెలిపారు ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, డి ఐ ఇ ఓ గణేష్, , జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీత, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### వరిధాన్యం కొనుగోలు కొరకు

# ముందస్తు ఏర్పాట్లు

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల ప్రతినిధి,సూర్య మేజర్ న్యూస్ :**

ప్రభుత్వ ఆదేశాల మేరకు వరిధాన్యం కొనుగోలు కొరకు రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ముందస్తు ఏర్పాట్లుచేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాలభవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా గ్రామీణాభివృద్ధి,బ్యాంకింగ్, పౌరసరఫరాలు, వ్యవసాయ, సహకార, రవాణా, మార్కెటింగ్ శాఖల అధికారులు, మెప్మా అధికారులతో కలిసిరైస్ మిల్లుల సంఘం ప్రతినిధులు, అధికారులతో యాసంగి 2024-25 వరిధాన్యం కొనుగోలుపై సన్నాహక సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల మేరకు రైతుల వద్ద నుండి నాణ్యమైన వరిధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. యాసంగి 2024-25 సంవత్సరానికి గాను గ్రేడ్ ఎ రకానికి 2 వేల 320 రూపాయలు,సాధారణ రకానికి 2 వేల 300 రూపాయలు మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు. వేసవి అయినందున నీడ,త్రాగునీరు ఇతర సౌకర్యాలు కల్పించడంతో పాటు ఓ. ఆర్. ఎస్. మెడికల్ కిట్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. తూకము చేయడానికి వినియోగించే కాంటా, బాట్లు, తేమ శాతాన్ని పరిశీలించే మాయిశ్చర్ మీటర్, గన్నీ సంచులు సమకూర్చుకోవాలని,అకాల వర్షాల నుండి ధాన్యాన్ని రక్షించుకోవడానికి అవసరమైన టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ( మిగితా...2లో )

### జన్నారం ఆలయాల్లో దొంగతనం

### - 15వేల నగదు అపహరణ

**జన్నారం, సూర్య మేజర్ న్యూస్ :** జన్నారం మండలం పలు గ్రామాల్లో గల మూడు ఆలయాల్లో మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. తిమ్మాపూర్ గ్రామంలో గల శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంతో పాటు,పక్కనే గల సత్యనారాయణ స్వామి శివాలయాల్లో గల మూడు హుండీలను పగలగొట్టి సుమారు 15వేల నగదును ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆలయాలను పరిశీలించారు.



# అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ బియ్యం పట్టివేత

**బెల్లంపల్లి, సూర్య మేజర్ న్యూస్:**



టాస్క్ ఫోర్స్ సీఐ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ లచ్చన్న సిబ్బందితో కలిసి తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోయపల్లి బోర్డ్ వద్ద, బెల్లంపల్లి నుండి తాండూర్ వైపుగా ట్రాలీలో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న దుర్గం శ్రీనివాస్, బుల్లి చందు,కనుగుల తిరుపతి,అనే ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న టాస్కోఫోర్స్ పోలీసులు. గోవిందుల శ్రీనివాస్ అనే వ్యక్తి పరారిలో ఉన్నాడు. ట్రాలీలో తరలిస్తున్న సుమారు 30 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్వాదినపరుచుకున్న 30 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని, ట్రాలీ,నిందితులను తదుపరి విచారణ నిమిత్తం తాండూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ కు అప్పగించినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు.

### ఇందిరమ్మ ఇండ్లు

## త్వరగా నిర్మించుకోవాలి

### - ఎంపిడివో ప్రవీణ్ కుమార్

**వాంకిడి, సూర్య మేజర్ న్యూస్**

ఇందిరమ్మ ఇండ్లు మంజూరు పొందిన లబ్దిదారులు తమ గృహాలను త్వరగా నిర్మించుకోవాలని ఎంపిడివో ప్రవీణ్ కుమార్ సూచించారు. మంగళవారం జైత్పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బోర్దా గ్రామంలో లబ్దిదారులతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, లబ్దిదారులు ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించాలని సూచించారు. నిర్మాణంలో ఏవైనా సందేహాలు ఉంటే హౌజింగ్ ఏఈ రత్నంను సంప్రదించాలని చెప్పారు.అదనంగా, లబ్దిదారుల జాబితాను మరోసారి చదివి వినిపించారు. జాబితాలో పేర్లు ఉన్న వారు తమ ఇంటి నిర్మాణ స్థలాన్ని చదును చేసుకుంటే, సంబంధిత ఇంజినీర్ మార్కింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శరణ్య, గ్రామస్థులు పాల్గొన్నారు.



# జాతీయ భద్రత వారోత్సవాలు




**- రోడ్డు నిబంధనలను పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంది.**

**- బెల్లంపల్లి ఎసిపి రవికుమార్.**

**మందమర్రి, సూర్య మేజర్ న్యూస్:**

54వ జాతీయ భద్రతా వారోత్సవాలు 2025 ని పురస్కరించుకొని మంగళవారం రోజున మందమర్రి టోల్ గేట్ దగ్గర జాతీయ రహదారి అధికారులు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని 54వ జాతీయ భద్రత వారోత్సవాలు ప్రాముఖ్యత తెలియజేశారు. భద్రతా యొక్క అవగాహనను పెంచడానికి, ప్రమాదాలను తగ్గించడానికి 1971లో నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్‌సి) ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రతి సంవత్సరం మార్చి 4న జాతీయ భద్రతా దినోత్సవాన్ని మనం జరుపుకుంటున్నాం. మేము రహదారి భద్రత గురించి ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన కూడా గత సంవత్సరం బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలో గల జాతీయ రహదారి 363 మీద రోడ్డు ప్రమాదాల ద్వారా 54 మంది మరణించారని తెలిపారు. రాత్రి సమయంలో రహదారులపై వాహనాలు నిలిపి ఉంచడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉందని అన్నారు. వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై నిరంతరం అవగాహన కల్పిస్తున్నామని, సంబంధిత అధికారులు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్,కాశీపేట ఎస్ఐ ప్రవీణ్ , జాతీయ రహదారి నిర్వహణ అధికారులు సునీల్,సిబ్బంది, ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కళ్యాణి**

**ఆసిఫాబాదు,సూర్య మేజర్ న్యూస్ :**

జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణ కొరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5 నుండి 25వ తేదీ వరకు జిల్లాలో జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కొరకు 19 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 3 వేల 997 మంది జనరల్, 761 మంది ఒకేషనల్, ద్వితీయ సంవత్సరంలో 4 వేల 527 మంది, 769 మంది ఒకేషనల్ విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు సరిపడా ఫర్నిచర్, త్రాగునీరు, ఫ్యాన్లు, వెలుతురు ఉండేలా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల పరీక్ష కేంద్రంలోనికి వెళ్ళే సమయంలో తనిఖీలు, విద్యార్థినులను తనిఖీ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. పరీక్షా కేంద్రంలోనికి మొబైల్, ఇతర ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబడవని తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో అత్యవసర వైద్య సేవలు నిమిత్తం వైద్య సిబ్బందిని నియమించి అవసరమైన మందులు, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు, విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆయా రూట్లలో సమయానుసారంగా బస్సులు నడిపించడం జరుగుతుందని తెలిపారు. పరీక్ష సమయంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.

## సాయిబాబా ఆలయానికి దండిగా వచ్చిన భక్తులు

**తలమడుగు, సూర్య మేజర్ న్యూస్:**

తలమడుగు మండలంలోని కుచిలాపూర్ గ్రామంలో గల శ్రీ సాయిబాబా ఆలయ 29వ వార్షికోత్సవం సందర్భంగా 26వ తేదీ నుంచి ఈనెల 4వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలతో సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేస్తూ వార్షికోత్సవ సంబరాలను జరుపుకున్నారు. ఈ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు ప్రతి ఏడు జాతరను



జరుపుకుంటారు అందులో భాగంగానే సాయిబాబా పల్లకిని గ్రామపురవీధులలో భక్తిశ్రద్ధలతో చిన్న పెద్దలు సాంస్కృతిక నృత్యాలు వేస్తూ సాయిబాబా పల్లకి ఊరేగింపులో భాగస్వాములు అవుతారు భక్తుల కోసం ఎల్లమ్మ నాటక ప్రదర్శనను బాలు మహారాజ్ ప్రవచనముల కార్యక్రమాలను అలయ కమిటీ వారు నిర్వహించడం జరిగింది అదేవిధంగా వచ్చిన భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఆలయ కమిటీ వారు తగిన ఏర్పాట్లను చూసుకోవడం జరిగింది. బాబాను దర్శించుకోవడానికి ప్రజాప్రతినిధులు అధికారులు అనధికారులు మరియు ఈ సాయిబాబా వార్షికోత్సవ జాతరకు చుట్టుపక్కలొని ఆదివాసి గ్రామాల నుంచి తాండల నుంచి పక్కన ఉన్న మహారాష్ట్ర నుంచి బాబాను దర్శించుకోవడానికి విచ్చేసి దర్శించుకుని వారి మొక్కులను మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అత్యాచారానికి గురైన బాధితురాలి కుటుంబానికి

## - మంత్రి సీతక్క ఆర్థిక సాయం

**ఆదిలాబాద్ ,సూర్య మేజర్ న్యూస్**

అత్యాచారానికి గురైన రణదివే నగర్‌కు చెందిన ఓ బాలిక నివాసాన్ని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సందర్శించారు .స్త్రీ శిశు సంక్షేమ శాఖ,జిల్లా ఇంచార్జి మంత్రి సీతక్క తరపున 25000/- రూపాయల ఆర్థిక సాయాన్ని బాలిక కుటుంబానికి



అందించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. మంత్రి సీతక్కకు ఫోన్ చేసి బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడించారు .మంత్రి వారికి పూర్తి భరోసా కల్పించారు. తాము అండగా ఉంటామని, ఆ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చూస్తానని ఆమె హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ,రఫీక్ ,మునిగెల విఠల్,ముజాహిదీన్,ఎంఏ షకీల్,జాఫర్,అతీఖ్, తుడుం రాములు,షౌకత్,దేరా కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఎస్ సి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ కు అవకాశం ఉండదు - నిర్మల్ డి ఈ ఓ రామారావు

**సోన్,సూర్య మేజర్ న్యూస్:** ఎస్ఎస్సి పరీక్షలలో మాస్ కాపీయింగ్‌కు అవకాశం ఉండదని డీఈఓ రామారావు అన్నారు.మంగళవారం మండలంలోని కడ్తాల్ ఉన్నత పాఠశాలను సందర్శించి,10 వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన నేరుగా 10వ తరగతి విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లారు. అక్కడ జరుగుతున్న ఆంగ్ల పీరియడ్‌ను పరిశీలించారు.అక్కడ ప్రదర్శించబడిన గ్రాండ్ టెస్ట్ మార్కుల ఆధారంగా విద్యార్థులను పిలిచి, అన్ని విషయాల్లో వారి ప్రగతిని విద్యార్థుల వారీగా పరిశీలించారు. గణితము, ఆంగ్లము రెండు విషయాల్లో చాలా కష్టపడాలని, చక్కని మార్కులు పొందాలని, అలాగే మిగతా విషయాలు కూడా కష్టపడి చదవాలన్నారు. విద్యార్థులందరూ పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని, గైర్హాజరు లో ఉండకూడదని సూచించారు. ఎవరు కూడా గైర్హాజరు కాకుండా వారి మిత్రులందరు చూసుకోవాలని తెలిపారు.పదోతరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ ఉండదని, పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని,విద్యార్థులు అన్ని విషయాలను చక్కగా కష్టపడి చదవాలని, ప్రశాంతంగా పరీక్షలు రాయాలని,ఆయన విద్యార్థులకు సూచించారు.పదో తరగతి విద్యార్థుల తరగతి గదిలో అన్ని విషయాలకు సంబంధించిన విద్యార్థుల ప్రగతిని ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్, జిల్లా ఉమ్మడి పరీక్షల సహాయ కార్యదర్శి భానుమూర్తి,ఆంగ్ల ఉపాధ్యాయురాలు శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.




### మండల సమస్యలపై

## ఎంపీకి వినతిపత్రం అందజేత

**జన్నారం, మార్చి 04, సూర్య మేజర్ న్యూస్ :**

జన్నారం మండలంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మండల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లో ఎంపీ గెడం నగేష్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. మండల సమస్యల్లో ముఖ్యమైన సమస్య కేంద్ర ప్రభుత్వం ద్వారా నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయాలని అలాగే జన్నారం పోలీస్ స్టేషన్ నుండి తపాలాపూర్ వరకు అడవి ప్రాంతంలో పై ఓవర్ నిర్మించాలని, 30 పడగల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని, సెంట్రల్ లైటింగ్ డివైడర్స్ ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు అభివృద్ధి కమిటీ కన్వీనర్ శ్రీరాములు కొండయ్య తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో కోడూరు చంద్రయ్య, ఆడేపు లక్ష్మీనారాయణ, బలవేణి రవి, ఎంబడి సత్యం, బైరి తిరుపతిలు ఉన్నారు.



## వరిధాన్యం కొనుగోలు కొరకు ముందస్తు ఏర్పాట్లు

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మొదటి పేజీ తరువాయి...

ధాన్యం తూకం చేయడానికి ముందే సంబంధిత రైతు వద్ద నుండి కూపన్, బ్యాంక్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం నకలు ప్రతులను తీసుకోవాలని, ఇట్టి వివరాలను ట్యాబ్‌లో నమోదు చేసి ధాన్యం కొనుగోలు చేసి రశీదు జారీ చేయాలని తెలిపారు. సన్నరకం, దొడ్డురకం ధాన్యాన్ని వేర్వేరుగా కొనుగోలు చేయడం జరుగుతుందని, ఈ క్రమంలో రైతులు విక్రయించనున్న సన్నరకం ధాన్యానికి వ్యవసాయ విస్తరణాధికారి ధృవీకరణ పత్రం అందించాలని తెలిపారు. కొనుగోలు వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్లో నమోదు చేయాలని తెలిపారు. కేంద్రానికి వచ్చిన గన్నీ సంచులను సరి చూసుకొని రిజిస్టర్ వివరాలు నమోదు చేయాలని తెలిపారు. వరిధాన్యం కొనుగోలు వివరాలను ప్రతి రోజు ట్యాబ్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, నిబంధనల మేరకు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి ట్యాగింగ్ చేయబడిన రైస్ మిల్లులకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. రైతులు కల్లాలలో ధాన్యాన్ని ఆరబెట్టి తప్ప, తాలు, మట్టిగడ్డలు లేకుండా నిబంధనల ప్రకారం పరిశీలించుకొని నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు ప్రక్రియకు కావలసిన తూకం యంత్రాలు, తేమ శాతం మీటర్లు, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్ల కొరకు టెండర్లు ఆహ్వానించి కొనుగోలు చేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ పరిధిలో సన్నరకం, దొడ్డురకం గుర్తించి ధృవీకరణ పత్రం అందించాలని, పంట కోత సమయంలో హార్వెస్టర్ నియంత్రణ వ్యవసాయ విస్తరణ అధికారులు చేపట్టాలని తెలిపారు. తూనికలు, కొలతల శాఖ ద్వారా పరీక్షించబడి ధృవీకరించబడిన తూకం యంత్రాలను మాత్రమే కొనుగోలు ప్రక్రియలో వినియోగించాలని, కొనుగోలు కేంద్రాలలో మాన్యువల్ తూకం జరుగకుండా డిజిటల్ తూకం యంత్రాల ద్వారా కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో 92 కొనుగోలు కేంద్రాలు, డి.సి.ఎం.ఎస్. ఆధ్వర్యంలో 67 కొనుగోలు కేంద్రాలు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 150 కొనుగోలు కేంద్రాలు,మెప్మా ఆధ్వర్యంలో 10 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. బ్యాంక్ గ్యారంటీ ఇచ్చిన వారికి, సి.ఎం. ఆర్. డెలివరీ సకాలంలో చేసిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం కేటాయింపు జరుగుతుందని తెలిపారు. ప్యాడీ క్లీనర్లు అవసరమైన చోట ఏజెన్సీల ఆధ్వర్యంలో విద్యుత్ సౌకర్యం లేని కొనుగోలు కేంద్రాలలోతాత్కాలిక మీటర్లు ఏర్పాటుచేసుకొనివినియోగించాలని తెలిపారు. గన్నీ సంచుల నిర్వహణ పక్కదారి పట్టకుండా జాగ్రత్తగావ్యవహరించాలని తెలిపారు. బెల్లంపల్లి, చెన్నూర్ ప్రాంతాలలో వరిధాన్యం పంట కోత ఆలస్యంగా ఒకేసారిగా వచ్చే అవకాశంఉన్నందున రవాణా ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా మార్కెటింగ్ అధికారి షహాబొద్దీన్, జిల్లా వ్యవసాయ అధికారి కల్పన, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు నల్మాసు కాంతయ్య, చిలువేరు వైకుంఠం, చిలువేరు శ్రీనివాస్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ ఆఫీసర్ పాలనలో

# ప్రజల పాట్లు

## - ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణిస్తున్న ప్రజలు

**కాగజ్‌నగర్, సూర్య మేజర్ న్యూస్**





కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మున్సిపల్ పరిధిలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి ఇరువైపులా రోడ్డు వెడల్పు చేయరు?కనీసం నడవాలన్న, ఆటోలో ,టూ వీలర్ పై వెళ్ళాలన్న ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురి అవుతూ నానా అవస్థలు పడుతున్నారు.దాంట్లో. రోడ్డుకు అడ్డంగా ఇనుప పైపులు వేసి ఈ దారిలో అత్యవసర పరిస్థితులలో పనికి వచ్చే దవాఖానాలు,ఫెర్టిలైజర్,ఫెస్టిసీడ్స్,నిత్యావసర కూరగాయలు,కిరాణా షాపులు, ప్రజలకు ఉపయోగపడే అన్ని రకాల సదుపాయాలు ఈ ఓవర్ బ్రిడ్జి ప్రక్క నుండీ వెళ్ళాలి.క్లిష్ట పరిస్థితులలో వెళ్లే రోగులకు,ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న వారు ఎవరో ?ఈ బ్రిడ్జికి ఇరు వైపుల డ్రైనేజీ ఉంది ఆ డ్రైనేజీ నీరు జీవ నదిలా 24×7 లా ప్రవహిస్తూ ఉంటుంది ,ఆ డ్రైనేజీ పై పూడిక తీత కొరకు పై కప్పుగా ఇనుప జాలీలు వేశారు కానీ ఆ జాలీలు రోడ్డుకు సమాంతరంగా వేయకుండా చాలా లోతుగా వేశారు దీనితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు,ప్రమాదాలకు గురి అవుతున్నారు.ఇప్పటికైనా నాయకులు,అధికారులు,స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.లేనిచో నిరాహార దీక్ష చేస్తామని ప్రజలు తెలిపారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ

# వేడుకల పోస్టర్ల ఆవిష్కరణ

**నిర్మల్ మార్చి 4, సూర్య మేజర్ న్యూస్**

తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని తన చాంబర్లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాదులో నిర్వహిస్తున్న మహిళా దినోత్సవ వేడుకలకు జిల్లా నుంచి మహిళా అధికారులు ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. టీ జీవోల సంఘం జిల్లా




అధ్యక్షుడు డాక్టర్ పిజి రెడ్డి మాట్లాడుతూ టీజీవో కేంద్ర సంఘం మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈనెల 6 తేదీ నుండి 8వ తేదీ వరకు హైదరాబాదులోని ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయ కళాశాల, దోమలగూడలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ వేడుకలకు రాష్ట్ర మహిళా మంత్రులు కొండా సురేఖ, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. జిల్లా నుండి అధిక సంఖ్యలో మహిళా ఉద్యోగులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి ధాత్రిక రమేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్, జిల్లా మహిళా విభాగ బాధ్యులు గోదావరి, డాక్టరు రాణి, కరుణశ్రీ, దేవోళ్ల లత, ఉపాధ్యక్షులు శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవి కుమార్, పబ్లిసిటీ సెక్రటరీ విష్ణు వర్ధన్, ఆఫీసు సెక్రెటరీ క్రాంతి కుమార్,కార్యవర్గ సభ్యులు,కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రంలో అధికారం వైపు బీజేపీ

### మండల అధ్యక్షులు రమేష్ గౌడ్

**తిర్యాణి, సూర్య మేజర్ న్యూస్**

రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి పార్టీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షులు సారా రమేష్ గౌడ్ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎలక్షన్లో బిజెపి పార్టీ బలపరిచిన ముక్క




కొమురయ్య విజయం సాధించడంతో మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలోని స్థానిక కొమురం భీమ్ చౌరస్తాలో ఆ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో టపాకాయలు కాల్చి మిఠాయిలు పంచుతూ విజయోత్సవాన్ని పంచుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో బీజేపీకి వస్తున్న అనుకూలత వల్ల సాధించిన విజయాలే బిజెపి పార్టీని రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి తీసుకు వస్తాయని ఆశ భావాన్ని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఇకనుంచి ఏ ఎన్నికలు వచ్చినా స్థానిక సంస్థ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల విఫలమైందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేయాలని కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థి కొమురయ్యకు ఓటేసి గెలిపించిన ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ మండల నాయకులు సీతారాం, పులి వెంకటేష్, గేడం సుభాష్, తోంగల తిరుపతి, భాస్కర్, వల్ల శ్రీధర్, హనుమంతి, కుమార్, బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యక్తిగత ఆరోపణలు చేయడం సరికాదు

**కాగజ్‌నగర్ రూరల్ , సూర్య మేజర్ న్యూస్**

గత కొద్ది రోజులుగా సిర్పూర్ నియోజకవర్గంలో పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు సోషల్ మీడియా వేదికగా పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారని, అంతటితో ఆగకుండా వ్యక్తిగత ఆరోపణలకు దిగడం సరికాదని బిజెపి పట్టణ అధ్యక్షులు శివ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సిర్పూర్ శాసనసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు పేరు రాసి 24.ఫిబ్రవరి 2025న ఒక పార్టీకి చెందిన నాయకుడు సోషల్ మీడియాలో రెండు అసభ్యకరమైన పదజాలాలతో పోస్ట్ పెట్టడం ఏమిటనీ ప్రశ్నించారు. సిర్పూర్ ఎమ్మెల్యే ఒక డాక్టర్‌గా పై చదువులు విదేశాల్లో పూర్తి చేసి వచ్చి సిర్పూర్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడాన్ని కొంత మంది జీర్ణించుకోలేక ఇలాంటి వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో ఎమ్మెల్యే పై అసభ్యకర పోస్టు పెట్టిన వారిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని, ఫిర్యాదు చేసి మూడు రోజులు గడిచిన పోలీసు అధికారులు మాత్రం ఎలాంటి ఎంక్వయిరీ చేయలేదని ఆయన ఆరోపించారు. ఈ అంశంలో రేపు జరగబోయే పరిణామాలకు పూర్తి బాధ్యత పోలీస్ శాఖ వారే వహించాల్సి ఉంటుందని బిజెపి పట్టణ అధ్యక్షుడు శివకుమార్ స్పష్టం చేశారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో

# మహిళలకు రుణ వితరణ

**నిర్మల్ , సూర్య మేజర్ న్యూస్**


స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, చిట్యాల శాఖ ఆధ్వర్యంలో నాలుగు స్వయం సహాయక సంఘాల మహిళలకు 60 లక్షల రుణాలను మంజూరు చేసినట్లు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్ తెలిపారు. మంగళవారం బ్యాంకు ఆవరణలో లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలను బ్యాంకు అధికారులతో కలిసి అందజేశారు. మంజూరైన రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని, చిన్న చిన్న వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ పాండు, సిబ్బంది రామకృష్ణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## బాలశక్తి కార్యక్రమం నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం

### - బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా కొనసాగించాలి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ మార్చి 4, సూర్య మేజర్ న్యూస్**



బాలశక్తి కార్యక్రమాన్ని పకడ్బందీగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాలశక్తి కార్యక్రమ నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్య, ఆర్థిక, సామాజిక సామర్థ్యాలు, నైపుణ్యాలు పెంపొందించేందుకు ప్రత్యేకంగా అమలుపరుస్తున్న బాలశక్తి కార్యక్రమాన్ని మెరుగ్గా అమలుపరచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ వైద్య పరీక్షల నిర్వహణ కార్యక్రమం నిరంతరం కొనసాగించాలని వైద్యాశాఖ అధికారులను ఆదేశించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన విద్యార్థులందరికీ హెల్త్ కార్డులను అందించాలని, అనారోగ్య సమస్యలను గుర్తించినట్లయితే వారికి ప్రత్యేక పోషక ఆహారం, మందులను అందించాలన్నారు. విద్యార్థుల పోషకులతో సమావేశాలు నిర్వహించి విద్యార్థుల ఆరోగ్య స్థితిగతుల వివరాలను తెలియజేయాలన్నారు. ఇప్పటికే పలువురు విద్యార్థులలో అనారోగ్య సమస్యలను గుర్తించి వారి అనారోగ్య సమస్యలను అధిగమించడానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక చర్యల ద్వారా ఇప్పటికే పలువురు విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులు మెరుగుపడ్డాయి, దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. పరీక్షల పట్ల భయాన్ని తొలగించేలా, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేలా మానసిక వైద్య నిపుణులతో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత పెంపొందించేలా క్షేత్రస్థాయిలో బ్యాంకులకు తీసుకువెళ్లి బ్యాంకు లావాదేవీలు, వివిధ రకాల రుణాలు, బ్యాంకింగ్ ఫారములు, సైబర్ అక్షరాస్యత పెంపొందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే పలు పాఠశాలల విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటనలు పూర్తయ్యాయని తెలిపారు.విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటనలకు వీలుగా వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని పాఠశాలల్లో నమూనా పార్లమెంట్ నిర్వహించి విద్యార్థులకు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఏప్రిల్ నెలలో విద్యార్థులందరికీ వివిధ అంశాలపై పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలశక్తి కార్యక్రమం పకడ్బందీగా నిర్వహిస్తూ విద్యార్థుల్లో వివిధ అంశాల పట్ల అవగాహన కల్పిస్తూ,ఆరోగ్యస్థితిగతులను మెరుగు పరిచినందుకు సంబంధిత అధికారుల సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నీటి కొరతఏర్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.బోరు బావుల్లో సమస్యలు తలెత్తితే వెంటనే మరమ్మత్తులు చేయించి నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ప్రతి పాఠశాలలో ఫిర్యాదులు,సూచనల పెట్టెలను ఏర్పాటు చేయాలన్నారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్,డిఈఓ పి.రామారావు, డిఎంహెచ్ఓ రాజేందర్,గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లాలీడ్‌బ్యాంకుమేనేజర్ రామ్‌గోపాల్, ఇతరఅధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మెల్ పాఠశాలలో ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం
### - ఆవిష్కరణలతో విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి
### - ఫాదర్ జెవిఆర్ రెక్స్ జే

**మందమర్రి, సూర్య మేజర్ న్యూస్.**

భవిష్యత్ తరాలకు ఉపయోగపడే ఆవిష్కరణలు చేసి విద్యార్థులు రేపటి శాస్త్రవేత్తలుగా ఎదగాలని కార్మెల్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు డాక్టర్ జెవిఆర్ రెక్స్ జే అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కార్మెల్ పాఠశాల ప్రాంగణంలో రంగోలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ రంగోలి కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినిలు పాల్గొని భౌతిక రసాయన శాస్త్రాలు, జీవ శాస్త్రంలోని కిరణరేఖ చిత్రాలు, వ్యామోగామి, సివి రామన్, శశు జననం, మానవుని విసర్జక వ్యవస్థ, రక్త ప్రసరణ వ్యవస్థల చిత్రాలు ముగ్గుల రూపంలో సృజనాత్మకంగా, ఆకర్షణీయంగా వేసిన ప్రదర్శన పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు డాక్టర్ జెవిఆర్ రెక్స్ జే మాట్లాడుతూ సైన్స్ అనేది మానవ జీవన పురోగతికి ఎంతో ఉపయోగపడిందని తెలియజేశారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో సైన్స్ ద్వారానే ప్రగతి సాధ్యమైందని, మూఢనమ్మకాలు మూఢ ఆచారాలను రూపుమాపాలన్నారు. ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, శాస్త్రీయ ఆలోచనలు పరిశీలన శక్తిని పెంపొందించుకోవాలని భవిష్యత్తులో విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ముగ్గులతో ఇంత చక్కటి ప్రదర్శన చేసిన విద్యార్థులను ఫాదర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎమ్ కుమారస్వామి, జీవశాస్త్ర ఉపాధ్యాయిని ఐ సునీత, ఇతర సైన్స్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల బృందం, పిఈటి కృష్ణ, విద్యార్థులు పాల్గొని ఈ రంగోలి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వారసంతలో ఉచిత మజ్జిగ పంపిణీ

**జన్నారం, మార్చి 04, సూర్య మేజర్ న్యూస్ :**

జన్నారం మండల కేంద్రంలో జరిగిన వారసంతలో మంగళవారం పొనకల్ పంచాయతీలోని గాంధీనగర్ కాలనీకి చెందిన యువ నాయకుడు ముడుగు ప్రవీణ్ కుమార్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వేసవి తాపాన్ని తీర్చేందుకు సంతకు వచ్చిన వారికి మజ్జిగ పంపిణీ చేశారు. వేసవికాలం ప్రారంభంలోని ఎండలు దంచి కొడుతుండడాన్ని గమనించిన ప్రవీణ్ కుమార్ సొంత ఖర్చులతో తయారు చేయించిన మజ్జిగను ప్రజలకు అందించడం హర్షించదగ్గ విషయమని పలువురు అన్నారు. ఇప్పటినుంచి మూడు నెలల పాటు ప్రతి మంగళవారం మజ్జిగ పంపిణీ చేస్తానని ముడుగు ప్రవీణ్ తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య
### -డీఈఓ యాదయ్య

**జన్నారం, మార్చి 04, సూర్య మేజర్ న్యూస్ :**

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందిస్తుందని, క్వాలిఫై ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నారని డిఇఓ యాదయ్య అన్నారు. జన్నారం మండల కేంద్రంలో గల బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన వార్షికోత్సవ వేడుకల్లో డీఈవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బాలికల పాఠశాలల్లో ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పిస్తుందని అన్నారు. జన్నారం బాలికల పాఠశాల ను పీఎం శ్రీ పాఠశాలగా ఎంపికైందని నాలుగు సంవత్సరాల కాలంలో పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించాలని ఆలోచనతో ప్రభుత్వం దృష్టి. సారించిందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రకరకాల నృత్యాలు, ఏకపాత్రాభినయంతో అలరించారు. త్వరలో జరగనున్న పదవ తరగతి పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ వేడుకల్లో ఎంఈఓ విజయ్ కుమార్, పాఠశాల హెచ్ఎం గొల్ల రామన్న, ఎస్ ఓ లు యశోద, సత్యనారాయణమూర్తి, కలమడుగు హెచ్ఎం కట్ట రాజమౌళి, దాముఖ కమలాకర్, బాపు, కందుల తిరుపతి, శ్రీనివాస్, బనావత్ ప్రకాష్ నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వాంకిడి జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలకి ఏర్పాట్లు పూర్తయ్యాయి

**వాంకిడి, సూర్య మేజర్ న్యూస్:**

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రేపటి నుండి ప్రారంభమయ్యే ప్రథమ సంవత్సర పరీక్షలకు కళాశాల అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకున్నారు.కళాశాల చీఫ్ సుపరిండెంట్ ఎం. చంద్రయ్య వివరాల ప్రకారం, 400 మంది జూనియర్ కళాశాల విద్యార్థులు, 97 మంది కేజీబీవీ విద్యార్థినులు ఈ పరీక్షల్లో హాజరవుతున్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.పరీక్షల నిఘా కోసం డిపార్ట్మెంటల్ అధికారిగా ఆత్మారాం నియమితులయ్యారని, అలాగే సీసీ కెమెరాల నిఘాలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించబడతాయని వెల్లడించారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

# ఘనంగా సింగరేణి ఉన్నత పాఠశాల 50వ వార్షికోత్సవం

### - సింగరేణి ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించడం అదృష్టంగా భావించాలి - ఏరియా జిఎం, సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ

మందమర్రి, సూర్య మేజర్ న్యూస్.

పట్టణ పరిసర ప్రాంత విద్యార్థులకు 50 సంవత్సరాల పాటు విద్యా సేవలందిస్తూ, 50వేల పైచిలుకు విద్యార్థులను వివిధ రంగాలలో ఉన్నత స్థాయిలో నిలిచేలా చేసిన సింగరేణి ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించడం అదృష్టంగా భావించాలని, మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ జి దేవేందర్, సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ శ్రీనివాసులు తెలిపారు. 50 వసంతాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పురుషోత్తం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 50వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఏరియా జనరల్ మేనేజర్ జి దేవేందర్, సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ శ్రీనివాసులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణిలో విధులు నిర్వహిస్తూ సేవలందిస్తున్న ఉద్యోగులు కార్మికులు పరిసర ప్రాంతాల ప్రజల పిల్లల ఉజ్వల భవిష్యత్తు విద్యతోనే సఫలం అవుతుందని భావించి సింగరేణి ఆధ్వర్యంలో విద్యాలయాలు ఆసుపత్రులు నిర్మించారని తెలిపారు. మందమర్రి ఏరియాలో సింగరేణి కార్మికుల పరిసర ప్రాంతాల ప్రజల పిల్లల ఉజ్వల భవిష్యత్తు చదువుతోనే సాధ్యమవుతుందని వారి విద్య వికాసం కోసం సింగరేణి ఉన్నత పాఠశాలను 1975 సంవత్సరంలో సింగరేణి సిఎండి బి.ఎన్.రామన్ ప్రారంభించారని తెలిపారు.




మందమర్రిలో సింగరేణి ఉన్నత పాఠశాల 50 సంవత్సరాలు పూర్తి చేసుకుని 50 వేల మంది విద్యార్థులకు పైగా విద్య బోధన అందించి దేశ విదేశాలలో ఉన్నత స్థాయి ఉద్యోగులు, వ్యాపారవేత్తలుగా ఎదిగి సింగరేణి కీర్తిని ఖండాంతరాలు దాటించారని కొనియాడారు. కార్పొరేట్ స్థాయి హంగులు సౌకర్యాలతో తీర్చిదిద్దడానికి సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం నాయక్ సంసిద్ధంగా ఉన్నారని, విద్యార్థుల విద్యాభ్యాసానికి పూర్తి సౌకర్యాలు యాజమాన్యం కల్పిస్తుందని తెలిపారు. ప్రముఖ భారత రాజకీయ శాస్త్రవేత్త, విశ్లేషకుడు, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రాజకీయ శాస్త్రం ప్రొఫెసర్ నాగేశ్వరరావు విద్యాభ్యాసం సింగరేణి పాఠశాలలో మొదలైందని గుర్తు చేశారు. పది ఎకరాల విశాల స్థలంలో, క్రీడా మైదానం ఆహ్లాదకరమైన విద్యాలయం విద్యార్థుల కోసం ఉచిత యూనిఫాం పుస్తకాలు మధ్యాహ్న భోజన పథకాలు అందిస్తున్నారని, కార్పొరేట్ స్థాయి విద్యలతో సమానంగా సైన్స్ ల్యాబ్ డిజిటల్ ల్యాబ్ గ్రంథాలయం, ఆర్ ఓ వాటర్ ప్లాంట్ సౌకర్యాలు కలిగి ఉన్న ఏకైక విద్యాలయమని చెప్పారు. 35 మంది నిష్ణాతులైన బోధన బోధనేతర సిబ్బందితో విద్యను అందిస్తూ 2023-24 సంవత్సరానికి 96 శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాల 2024-25 సంవత్సరానికి 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్బంధం లేని విద్యతో పాటు క్రీడలు, సైన్స్ ప్రయోగాలు, స్కౌట్స్ అండ్ గైడ్స్, కళల పట్ల అభిరుచి కలిగిన విద్యార్థులకు ప్రోత్సాహక శిక్షణలో అందిస్తున్నారని పేర్కొన్నారు. 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను సింగరేణి ఆధ్వర్యంలో జూన్ మాసంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఏరియా సేవా అధ్యక్షురాలు సరూప రాణి, ఎస్ఓ టు జిఎం విజయ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సిబ్బందినీ అదుపులోకి తీసుకున్న రామకృష్ణాపూర్ పోలీసులు

**రామకృష్ణాపూర్, మార్చి 04, సూర్య మేజర్ న్యూస్.**

రామకృష్ణాపూర్ పట్టణంలో గల రాజీవ్ చౌక్, బి-జోన్ సెంటర్ లో 11 మంది అంగన్వాడీ సిబ్బంది మంగళవారం ఉదయం అందరు సమావేశమయ్యారు, ఈ సమావేశంలో అందరూ కలిసి హైదరాబాద్ లోని ప్రజాభవన్ ముట్టడికి కోసం చర్చించుకున్నారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తుండగా, వారి చర్యలు శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ఉన్నందున ముందస్తు చర్యలో భాగంగా వారిని అదుపులోకి తీసుకోని, పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేయడం జరిగిందని పట్టణ ఎస్సై జి రాజశేఖర్ పత్రికా ప్రకటనలో తెలిపారు.

## అమాయక గిరిజనులపై అక్రమ కేసులుఉన్నతాధికారుల జోక్యం కోరుతున్న కుటుంబ సభ్యులు

**వాంకిడి,సూర్య మేజర్ న్యూస్**

మండలం వెలిగి పంచాయతీలోని రింగరిట్ గ్రామానికి చెందిన కోవ రాము, కోవ జంగులపై అటవీశాఖ అధికారులు అక్రమంగా కేసులు బనాయించి రిమాండ్‌కు పంపారని వారి కుటుంబ సభ్యులు మంగళవారం విలేకరుల ముందుకు వచ్చి తమ గోడును వెల్లబోసుకున్నారు.వారి కుటుంబ సభ్యులు భీమ్ భాయ్ ఆత్రం మారుతి, కోవ లక్ష్మణ్ మాట్లాడుతూ, గత శనివారం రాము, జంగుల పశువులను కాసేందుకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా అటవీశాఖ అధికారులు వారిని బలవంతంగా జీపులో ఎక్కించుకుని తీసుకెళ్లారని తెలిపారు. అనంతరం, వారు అడవిలో చెట్లు నరికారని అబద్ధపు అభియోగాలు మోపి అక్రమంగా కేసులు నమోదు చేశారని వాపోయారు.అమాయక గిరిజనులను అక్రమంగా వేధించడం తగదని, అటువంటి చర్యలను తక్షణమే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. నిరపరాధులను వదిలిపెట్టాలని, జరిగిన అన్యాయంపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు.



## గోల్డెన్ జూబ్లీ ఆఫ్ సింగరేణి పాఠశాల వజ్రోత్సవాలను విజయవంతం చెయ్యండి
### - సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి శ్రీనివాస్

**మందమర్రి, మార్చి 4, సూర్య మేజర్ న్యూస్.**

మందమర్రి పట్టణంలో సింగరేణి ఉన్నత పాఠశాల స్థాపించి 50 సంవత్సరాలు పూర్తవుతున్న శుభ సందర్భంగా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని సింగరేణి (కొత్తగూడెం) ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి జి శ్రీనివాస్ కోరారు. మంగళవారం పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో పాఠశాల సిబ్బందితో కలిసి మొక్కలు నాటే కార్యక్రమానికి నాంది పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో సింగరేణి పాఠశాల ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తవుతుండడంతో ఈ సంవత్సరం జూన్ మాసంలో పాఠశాల ఆవరణలో వజ్రోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందనీ, పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు సమిష్టిగా కృషిచేసి వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. వజ్రోత్సవ వేడుకలకు సింగరేణి సి అండ్ బలరాం నాయక్ తో పాటు సింగరేణి ఉన్నతాధికారులు హాజరవుతున్నారని తెలిపారు. పాఠశాలలో నాటి నుండి నేటి వరకు సుమారు 50 వేల మంది విద్యార్థులకు విద్యనందించి చదువుల తల్లిగా సరస్వతి దేవాలయంగా పాఠశాల బాసిల్లుతుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే కాకుండా వారికి క్రీడలు,అథ్లెటిక్స్, మ్యూజిక్, ఎన్సిసి,స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ప్రత్యేక శిక్షణ అందించడం జరుగుతుందని, విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించే లక్ష్యంతో యోగా మెడిటేషన్ వంటి అంశాలలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సింగరేణి పాఠశాలల బలోపేతానికి సింగరేణి యాజమాన్యం కృషి చేస్తుందని అన్నారు. అట్టహాసంగా నిర్వహిస్తున్న వజ్రోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ప్రస్తుత పూర్వ ఉపాధ్యాయులను, విద్యార్థులను కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నరసింహస్వామి, శ్రీరాంపూర్ సింగరేణి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంతోష్, పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

